





నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com



## ఉమ్మడి వరంగల్
హన్మకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు

17 । జూన్ । 2024 । పేజీలు : 8


# తమ్ముడూ... మనమే... సర్పంచ్

- గణపురం మేజర్ సర్పంచ్ కోసం ముందస్తు ప్రచారం
- పార్టీలు మారిన వారే ప్రచారంలో ముందు వరుస
- కోటి రూపాయలైనా పరవాలేదు మేమే సర్పంచ్
- నోటిఫికేషన్ రాకున్నా ప్రచారంపై ముక్కున వేలేసుకుంటున్న జనం
- వలస పక్షులపై సొంత పార్టీ నేతల గుర్రు

గణపురం జూన్ 16 మేజర్ న్యూస్ సూర్య: వరుసగా పార్టీలు మారిన వారు తమ్ముడు మనమే సర్పంచ్ అంటూ ఎలక్షన్ నోటిఫికేషన్ రాకుండా వాడవాడల రూపాయి ఖర్చు లేకుండా ప్రచారం చేస్తున్నారు. గతంలో తమ ఉనికి కోసం వివిధ పార్టీలు మారిన వారు ముందస్తుగా వార్డులను ఎంపిక చేసుకొని అవసరం ఉన్నా లేకున్నా ఇల్లు, మిగతా 2లో..






## ఉమ్మడి జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన నూతన కలెక్టర్లు

2లో






అల్ఫా బేకరి & స్వీట్స్ - పరకాల


## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్



2లో

## త్యాగ నిరతికి ప్రతీక బక్రీద్...!

నేడు బక్రీద్ పండగ వేడుకలు...

ఖుర్బాని ఇవ్వడానికి ముస్లిం సోదరులు ఏర్పాట్లు...

6లో





## భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్

### కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు

వరంగల్ టౌన్ జూన్ 16, మేజర్ న్యూస్: నూతనంగా వరంగల్ జిల్లా కలెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దేవి ఆదివారం ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న కలెక్టర్ కు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారి శేష వస్త్రాన్ని తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## ఉమ్మడి జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన నూతన కలెక్టర్లు

హనుమకొండ సూర్య ప్రతినిధి, జూన్ 16, మేజర్ న్యూస్ : ఉమ్మడి జిల్లాలో నూతన కలెక్టర్లు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ గా పి. ప్రావీణ్య , వరంగల్ జిల్లా కలెక్టర్‌గా సత్య శారదాదేవి, ములుగు జిల్లా కలెక్టర్‌గా టిఎస్ దివాకర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా రాహుల్శర్మ లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖ ఉన్నతాధికారులు, ఆర్డీఓలు, తహశీల్దార్లు, ఆయా జిల్లా అధికారులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్లను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కలను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయా జిల్లా కలెక్టర్లు అధికారులతో సమావేశమై శాఖల వారిగా వివరాలు అడి గి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్లు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయా జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

## తమ్ముడూ... మనమే... సర్పంచ్...

మొదటి పేజీ తరువాయి..

ఇల్లు తిరుగుతూ కుటుంబ సభ్యులను పలకరిస్తూ తమ్ముడు నేను సర్పంచ్ గా పోటీ చేస్తున్నాను నాకు ఓటు వేయాలని ప్రచారం చేసుకుంటున్నారు. గత 19 సంవత్సరాలుగా పార్టీని నమ్ముకొని పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన వ్యక్తులు వెనుకబడి పోతున్నారు. కొత్తగా వచ్చిన వారితో వారి ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుంది. పదవుల కోసం కాకుండా తాము నమ్ముకున్న నాయకుని కోసం ఎన్నో కష్టనష్టాలు కోర్చి రాత్రింబవళ్లు కేసులకు సైతం వెనుకాడకుండా పనిచేసినవారు తమ పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించుకుంటున్నారు. అదేవిధంగా తమ అక్రమ వ్యాపారాల కోసం అధికార పార్టీలో కొనసాగేందుకు పార్టీలు మారుతూ వచ్చినవారే పదాల కోసం పాకులాడుతున్నారని పాత కాపులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ మధుసూదనా చారి నుండి మాజీ చీఫ్ విప్ భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ వరకు అన్ని పార్టీలు వీళ్లవే ఏ పార్టీ రూలింగ్ లో ఉన్న ఆ పార్టీలోకి వెళ్లడం కొందరికి నైజంగా మారింది కానీ పార్టీ కోసం సర్వశక్తులు వోడ్డీ నిరంతరం పనిచేసిన వారికి వలస పక్షులు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కేవలం కొన్ని నెలలు కూడా అధికారంలో లేకుండా ఉండలేకపోతున్నవారు. పార్టీ కోసం పనిచేసే వారిని తొక్కే ప్రయత్నం చేస్తూ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతూ పదవుల కోసం పాకులాడుతున్నారు. గణపురం సర్పంచి పదవి పై కన్నేసిన సదర్ నేతలు పార్టీ మారిన నాటి నుండి వాడవాడలా తిరుగుతూ చాప కింద నీరులా ప్రచారం కొనసాగిస్తున్నారు అయ్యో ఇప్పుడే సర్పంచ్ ఎలక్షన్ లు వచ్చాయా అని అందరు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా ముఖ్య నేతలు కష్టపడే వారిని గుర్తించి వారికి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. వలస పక్షుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి అవకాశవాద రాజకీయ నాయకులకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ప్రజలపై ఉంది.

# వరంగల్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సత్య శారదదేవి



శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా, రెవిన్యూ అధికారులు, సిబ్బంది



వరంగల్ టౌన్, జూన్ 16, మేజర్ న్యూస్: వరంగల్ జిల్లా కలెక్టర్ గా డాక్టర్ సత్య శారదదేవి ఆదివారం జిల్లా కలెక్టరేట్ లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి సంజీవ రెడ్డి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, డిపిఆర్ఓ అయ్యుబ్ అలీ, డి ఈ ఓ వాసంతి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, ఆర్డీవోలు సీతం దత్తు, కృష్ణవేణి, ఎల్ డి ఎం హవేలీ రాజు, కలెక్టరేట్ ఏవోలు శ్రీకాంత్, అబిద్ అలీ, తహసిల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు, ఫణి కుమార్, విజయ్, రవిచంద్ర రెడ్డి, పర్యవేక్షకులు మంజుల, చంద్రశేఖర్, నాయబ్ తహసీల్దార్ లు, సిబ్బంది తదితరులు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలసి మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకొనున్నట్లు తెలిపారు.త్వరలో శాఖల వారిగా సమీక్షలు నిర్వహిస్తానని , జిల్లా అధికారుల సమన్వయంతో అభివృద్ధి లో వరంగల్ జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని అన్నారు.

## హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన పి. ప్రావీణ్య



హనుమకొండ సూర్య ప్రతినిధి, జూన్ 16, మేజర్ న్యూస్ : హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా పి.ప్రావీణ్య ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సముదాయ భవనానికి చేరుకోగా జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి , డిఆర్ఓ వైవి గణేష్‌లు స్వాగతం పలికారు.అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ గా పి. ప్రావీణ్య బాధ్యతలు స్వీకరించారు.







## వరంగల్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన కమీషనర్

### పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపిన కమిషనర్

హనుమకొండ , జూన్ 16 మేజర్ న్యూస్: వరంగల్ జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సత్య శారదా దేవి ని ఆదివారం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.





## మంత్రి సీతక్కను కలిసిన నూతన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ములుగు, సూర్యప్రతినిధి జూన్ 16 (మేజర్ న్యూస్) : జిల్లా కలెక్టర్ గా దివాకర టి.ఎస్. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలోని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ మంత్రి సీతక్కని మర్యాదపూర్వకంగా కలిసి కి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆర్థిక సహాయం అందించిన బాల కిశోర్ రెడ్డి



గీసుగొండ జూన్ 16 మేజర్ న్యూస్ (సూర్య): మండలంలోని ఊకల్ హావేలి గ్రామంలో ఇటీవల మృతి చెందిన మండల సాంబయ్య కుటుంబానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు, ప్రజా సేవకులు అల్లం బాలకిషోర్ రెడ్డి అందించిన ఆర్థిక సహాయాన్ని అల్లం మర్రెడ్డి చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందచేశారు.కార్యక్రమంలో సీనియర్ నాయకులు వీరగోని రాజ్ కుమార్,మాదాసి రాంబాబు,కొమ్ము శ్రీకాంత్,కందికొండ రాజ్ కుమార్ ,కక్కర్ల సుభాష్ ,మండల నరేష్,నకిన బోయిన నాగరాజు,వేతినేని నర్సింహరావు,చిన్న పెల్లి కుమారస్వామి,పల్లెపాటి రాజు, పోసాల మల్లేష్,మండల నాగరాజు,సంతోష్ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## చిన్నారిని హత్య చేసిన నిందితుడికి ఉరిశిక్ష వేయాలి

### ఉత్తర తెలంగాణ మాల జేఏసీ చైర్మన్ తుప్పరి రంజిత్ కుమార్



గీసుగొండ జూన్ 16 మేజర్ న్యూస్ (సూర్య) సుల్తానాబాద్ మండలం కట్నాపల్లిలో బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితున్ని ఫోక్స్ చట్టం ప్రకారం శిక్షించి వారి కుటుంబానికి 50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని ఉత్తర తెలంగాణ మాల జేఏసీ చైర్మన్ తుప్పరి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.పెద్దపల్లి జిల్లా కట్నాపల్లి రైస్ మిల్లులో బాలిక పై జరిగిన అత్యాచారం,హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లు యజమానులు తక్కువ వేతనాలకు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి ఎలాంటి నియమ నిబంధనలు పాటించకుండా పనిలో చేర్చుకుంటున్నారని,అక్కడ ఏం జరిగినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రతి సంవత్సరం ఏదో ఒక ఘటన జరుగుతున్న కఠినమైన చర్యలు తీసుకోవడం లేదని,గతంలో ఇటుక బట్టీలో బాలిక పై ఇదే రకమైన దాడి జరిగిందని, అధికారులు, పోలీస్ యంత్రాంగం కఠినమైన చర్యలు తీసుకోకపోవడం వల్ల నేరస్తులకు భయం లేకుండా పోయిందని అన్నారు.ఇతర రాష్ట్రం నుంచి కార్మికులను తీసుకొచ్చినప్పుడు వారికి సంబంధించిన వివరాలు అధికారులు ,పోలీస్ సిబ్బంది వద్ద లేకపోవడం ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు.యజమాన్యాలపై,నిందితుల పైన వెంటనే కేసు పెట్టి ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండలం కట్నాపల్లిలో బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన నిందితున్ని ఫోక్స్ చట్టం ప్రకారం శిక్షించి వారి కుటుంబానికి 50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని రైస్ మిల్లు యజమానియా పైన కూడా చర్యలు తీసుకోవాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.

# నీట్ ప్రవేశ పరిక్ష పై అనుమానాలు

### ప్రవేశ పరీక్షపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

### పరీక్ష మరల నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలి

### నీట్ ప్రవేశ పరిక్ష స్థానిక భాషలో నిర్వహించాలి

### కేయూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘు కార్యదర్శి మర్రి మహేష్



గీసుగొండ జూన్16 మేజర్ న్యూస్ (సూర్య) నీట్ యూజీ ప్రవేశ పరీక్ష పై అనుమానాలు ఉన్నాయని, వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కాకతీయ యూనివర్సిటీ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘు కార్యదర్శి మర్రి మహేష్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన నీట్ ఎంట్రన్స్ ఫలితాలు విడుదలైన విషయ తెలిసిందే.ఈ పరీక్ష ఫలితాలు నోటిఫికేషన్ నియమ నిబంధనల ప్రకారం ఈనెల 14వ తేదీన విడుదల కావాల్సి ఉండగా పరీక్షల నిర్వహణలో లోపాలు బయటకు రాకుండా ఎన్నికల ఫలితాలు విడుదలైన రోజు 4వ తేదీన అట్టహాసంగా విడుదల చేయడం అనేక అనుమానాలకు దారితిస్తున్నాయని అన్నారు.నీట్ యూజీ ప్రవేశ పరీక్షలో ఒక సమాధానంకు నాలుగు మార్కులు అలాగే ఒక తప్పు సమాధానానికి ఒక్క మార్కు నెగటివ్ ఉంటుంది. కానీ, ఇందులో విద్యార్థులకు చిత్ర విచిత్రమైన మార్కులు వచ్చాయాని కొంత మంది విద్యార్థులకు 718, 719 మార్కులు ఎలా వచ్చాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తే యూజీసీ మాత్రం గ్రేస్ మార్కులు కలిపామని దాటవేస్తున్నారని ఆరోపించారు. గ్రేస్ మార్కులు కలపాలని నీట్ యూజీ నియమ నిబంధనలలో లేకున్నా ఎలా కలిపారని ప్రశ్నించారు.ఇప్పటికే విడుదలైన పరీక్ష ఫలితాలలో ఒకే పరీక్ష కేంద్రంలో ఒకే వరుసగా ఉన్న విద్యార్థులకు ఒకే విధంగా మార్కులు రావడం ప్రవేశ పరీక్ష లోపాలు కనిపిస్తున్నాయని అన్నారు.ప్రవేశ పరీక్ష పేపర్ లికేజీ అయిందని వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం, ఎన్డీఏ విచారణ చేపట్టకుండా ,విద్యార్థులకు అన్యాయం చేస్తుందని, కోన్ని చోట్ల జరిగిన మాల్ ప్రాక్టీస్ వలన చదువుకునే విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.రాష్ట్ర స్థాయిలలో జరిగే ప్రవేశ పరీక్షలలో అవినీతి జరుగుతుందిని,అవినీతిని అరికట్టాలనే ఉద్దేశంతో దేశ వ్యాప్తంగా ఒకటే పరీక్ష ఉండటం వలన అవినీతిని అరికట్టవచ్చనే ఉద్దేశంతో 2016లో అప్పటి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా వైద్య ,విద్య ప్రవేశలకోసం తీసుకువచ్చిన నీట్(నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్) అండర్ గ్రాడ్యుయేషన్ పరీక్షలలో సైతం అవినీతి, అక్రమాలు జరగడం ప్రభుత్వాల చేతకాని తనానికి నిదర్శనమని, నీట్ ప్రవేశ పరీక్షను కేవలం హింది, ఇంగ్లిష్ భాషలో నిర్వహించడంతో దక్షణాది రాష్ట్రాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, నీట్ యూజీ పరీక్షను స్థానిక బాషలలో కూడా నిర్వహించి దక్షణాది రాష్ట్రాల ప్రజలకు న్యాయం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నీట్ యూజీ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని,అక్రమాలపై వస్తున్న ఆరోపణలను పరిగణలోకి తీసుకుని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని కాకతీయ యూనివర్సిటీ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘు కార్యదర్శి మర్రి మహేష్ డిమాండ్ చేశారు.

## కిక్ బాక్సింగ్ కోచింగ్‌లో ఉత్తీర్ణులైన వారికి జ్ఞాపికను అందజేసిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు

హసన్ పర్తి, జూన్ 16, మేజర్ న్యూస్ :హసన్ పర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో వేసవికాలం సందర్భంగా గత కొద్దిరోజుల నుండి కిక్ బాక్సింగ్ కోచ్ పార్థసారధి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కిక్ బాక్సింగ్ కోచింగ్ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు పాల్గొన్నారు. బాక్సింగ్ కోచింగ్ లో ఉత్తీర్ణులైన వారికి జ్ఞాపికలను అందజేసారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూవిద్యార్థి, విద్యార్థినీలు వేసవి కాలంలో సెలవులను వృథా చేయకుండా తమ కెరియర్ కు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలకు హాజరుకావడం హర్షించదగిన విషయమన్నారు. ఈ ఉచిత బాక్సింగ్ కోచింగ్ లో పాల్గొన్న విద్యార్థులందరికీ ఎమ్మెల్యే అభినందనలు





తెలియజేసారు. రాష్ట్ర మరియు జాతీయ అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలో పాల్గొనేలా కష్టపడాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగెళ్లపల్లి తిరుపతి, ఎంపీపీ కేతపాక సునీత, మాజీ సర్పంచ్ జోరిక పూలమ్మ, మాజీ జెడ్పిటిసి సారంగపాణి, ఎస్సీ సెల్ నాయకులు గొర్రె కిరణ్, శశికుమార్ మరియు హాసన్పర్తి మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, బాక్సింగ్ కోచ్ పార్థసారథి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వానలు కురియాలని చిన్నారుల కప్పతల్లి ఆట...!

చెన్నారావుపేట జూన్ 16 (సూర్య మేజర్ న్యూస్): వానలు కురియాలని చిన్నారులు కప్పతల్లి ఆట ఆడిన సంఘటన మండలంలోని పత్తి నాయక్ తండ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన చిన్నారులు బానోతు బన్ని, రాహుల్, లోకేష్, తిలక్ అనే చిన్నారులు కర్రకు కప్పను కట్టుకొని చుట్టూ వేప మండలను చుట్టుకుని డప్పు వాయిద్యాల నడుమ ఇంటింటికి కప్పతల్లి ఆటను ఆడుతూ తిరిగారు. దీంతో మహిళలు నీళ్లను ఆరబోస్తూ మొక్కులు సమర్పించారు. వర్షాలు కురిపించి సమృద్ధిగా పంటలు పండే విధంగా చూడాలని వరుణ దేవుడిని వేడుకున్నారు. దీంతో పత్తి నాయక్ తండాలో కప్పతల్లి ఆట సందడి వాతావరణం కనిపించింది.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన ఆదర్శ కాలనీవాసులు



చెన్నారావుపేట జూన్ 16 (సూర్య మేజర్ న్యూస్): చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన కుండె సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబానికి ఆదర్శ కాలనీవాసులు రూ. 11 వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో పలువురికి ఆదర్శంగా ఉంటూ ఎవరైనా ఆపదలో ఉంటే ఆదుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కాలనీలో ఎవరైనా మరణిస్తే తక్షణ సహాయంగా ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఎంతో చేదోడు వాదోడుగా ఉంటూ అందరం ఐక్యంగా ఉండి కష్టసుఖాల్లో పాలు పంచుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మేడారంలో ప్లాస్టిక్ కవర్లు వాడొద్దు

### పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు



తాడ్వాయి జూన్ 16మేజర్ న్యూస్ సూర్య: మేడారంలో ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని పూజార్ల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు అన్నారు. ఆదివారం ఆయన గ్రామంలోని వ్యాపారులు అందరు కూడా ప్లాస్టిక్ సంచులను వాడకం బంద్ చేసి.బయోడిగ్రేడ్బుల్ సంచులను వాడాలని ,దుకాణదారులకి అభ్యుదయ యువజన సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సమ్మక్క సారలమ్మ పూజారులు,పూజరుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు,కాక సారయ్య, కొక్కెర రమేష్ యూత్ అధ్యక్షుడు సిద్దబోయిన భోజా రావు,ఉపాధ్యక్షుడు అలం వెంకటేష్, సిద్దబోయిన రవీందర్ మేడారంలోని దుకాణదారులకు ,ప్రజలకు ప్లాస్టిక్ సంచుల వాడకం ఆపివేయాలని భూమిలో సులభంగా కలిసిపోయి, పర్యావరణానికి ఎలాంటి హానీ చేయని బయోడిగ్రేడ్బుల్ సంచుల వాడాలని సూచించారు. వ్యాపారులు ప్లాస్టిక్ సంచుల వాడకం కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ,వ్యాపారులు అందరు కూడా ప్లాస్టిక్ నివారణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూజారులు,వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి జ్ఞాపకార్థం ఆర్థిక సహాయం అందజేత



గీసుగొండ జూన్ 16 మేజర్ న్యూస్ (సూర్య)మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన నల్ల సరోజన , మాదాసి స్వామి ( గ్రామ పంచాయతీ కార్మికుడు) అనే దళిత సామాజిక వర్గానికి చెందిన నిరుపేద వ్యక్తులు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు.విషయం తెలుసుకున్న గీసుగొండ హైస్కూల్ లో విధులు నిర్వహించిన పూర్వపు ఉపాధ్యాయురాలు ముత్తినేని జయలక్ష్మి తన తండ్రి ముత్తినేని మనోహర్ రావు జ్ఞాపకార్థం రూ. 5000/ ల ఆర్థికసహాయాన్ని పంపగా,అట్టి నగదును గీసుగొండ గ్రామానికి చెందిన కర్ణకంటి రాంమూర్తి బాధితులకు చెరొక రూ2500/-ల చొప్పున అందచేశారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు మాదాసి రాంబాబు, పద్మ పాల్గొన్నారు.

## చెన్నారావుపేట తహసిల్దార్ కార్యాలయంలో

# రెవెన్యూ లీలలు...!

### ఎలాంటి పత్రాలు లేకుండానే అక్రమ వారసత్వ పట్టా మార్పిడి చేసిన అధికారులు

### సమాచార హక్కు చట్టంతో వెలుగులోకి

### రెవెన్యూ అధికారుల పై చర్యలు తీసుకోవాలని

### బాధితుడు చెలుకలపెల్లి నరసింహ స్వామి వేడుకోలు



చెన్నారావుపేట జూన్ 15: చెన్నారావుపేట తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ లీలలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. కాసులు కురిపిస్తే కాని పని ఏది కాదన్నట్లుగా రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ పనుల కోసం తిరిగినా కాని పనులు కాసులు ముట్టజెప్పితే ఏ పనైనా నిమిషాల్లోనే పూర్తవుతుందనే ఆరోపణలు బాహాటంగా వినిపిస్తున్నాయి. అంతేకాక ఎలాంటి పత్రాలు లేకుండా ఎలాంటి ఆధారాలు చూపకుండా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టకుండానే రెవెన్యూ అధికారులు ఏకంగా అక్రమ వారసత్వ పట్టానే మార్పిడి చేశారు. ఈ సంఘటన సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి వచ్చింది... వివరాల్లోకి వెళితే.... చెన్నారావుపేట గ్రామ శివారులో చెన్నారావుపేట-నెక్కొండ ప్రధాన రహదారిలో పోలీస్ స్టేషన్ కు అతి సమీపంలో సర్వేనంబర్ 555 లో 38 గుంటల భూమి చెలుకలపల్లి నరసయ్య పేరు మీద ఉంది. ఈయన కాస్తు కబ్జాలో ఉండి 22 డిసెంబర్ 2016వ సంవత్సరంలో అనారోగ్య కారణంతో మృతి చెందాడు. ఇతనికి వారసులు ఎవరూ లేకపోవడంతో నరసయ్య అన్న కుమారుడు నరసింహస్వామి తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించాడు. నరసయ్య ఆలన పాలన, బాగోగులు చూసుకొని దహన సంస్కారాలు నిర్వహించినందుకు గాను ముదిరాజ్ కుల పెద్ద మనుషులు, రక్తసంబంధీకులు నరసయ్యకు చెందిన 38 గుంటల భూమి నరసింహస్వామికి చెందాలని ఏప్రిల్ 9 వ తేదీన 2017 వ సంవత్సరంలో తీర్మాణం చేసి నిర్ణయించారు. కాని ఇది ఇలా ఉండగా నర్సంపేట మండలం మగ్దుంపురం గ్రామానికి చెందిన నూనె ప్రమీల అనే మహిళ చెలుకలపెల్లి నరసయ్యకు నేనే వారసురాలినని ఆ 38 గుంటల భూమిని పసుపు కుంకుమల కింద రాసిచ్చాడని ఓ తెల్ల కాగితం సృష్టించుకుని వచ్చి ఆ భూమిని చెలుకలపెల్లి రాజుకు అమ్మినట్లు మరో తెల్ల కాగితం సృష్టించింది. ఈ రెండు తెల్ల కాగితాలను పట్టుకొని తహసిల్దార్ కార్యాలయంలో సాదా బైనామా కింద చెలుకలపల్లి రాజు 29 అక్టోబర్ 2020 వ సంవత్సరంలో దరఖాస్తు చేశాడు. ఆ దరఖాస్తును రెవెన్యూ అధికారులు తిరస్కరించారు. అనంతరం రెవెన్యూ అధికారులు ఎలాంటి పూర్తి ఆధారాలు లేకుండానే చెలుకలపల్లి రాజు పేరుమీద అప్పటి తహసిల్దార్ పూల్ సింగ్ చౌహాన్ (ప్రస్తుతం మేడ్చల్ జిల్లా బాచుపల్లి తహసిల్దార్), డిప్యూటీ తహసిల్దార్ మధుసూదన్, గిర్దావర్ స్వామి, సీనియర్ అసిస్టెంట్ సలీం పాషా (ప్రస్తుతం నల్లబెల్లి తహసిల్దార్ కార్యాలయం), ధరణి ఆపరేటర్ సుధీర్ రెడ్డి (ప్రస్తుతం సంగెం తహసిల్దార్ కార్యాలయం), వీఆర్వో ఐలయ్య (ప్రస్తుతం వర్ధన్నపేట మున్సిపాలిటీ కార్యాలయం)లు 19 ఫిబ్రవరి 2020వ సంవత్సరంలో అక్రమ వారసత్వ పట్టా మార్పిడిని ధరణి ద్వారా చేశారు. ఉన్న భూమి 38 గుంటలు అయితే 1 ఎకరం 13 గుంటల భూమి ఉన్నట్లుగా అంటే అదనంగా 11 గుంటల భూమిని చెలుకలపెల్లి రాజు పేరు మీద అక్రమంగా ఎక్కించి వారసత్వ పట్టా మార్పిడిని చేపట్టారు. పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని ఈతంగానికి పాల్పడినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ విషయాన్ని బాధితుడు చెలుకలపల్లి నరసింహస్వామి సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలిపాడు. ఈ విషయంపై తహసిల్దార్ కార్యాలయంలో అధికారులను నిలదీసి అడగగా

వారసత్వ పట్టా మార్పిడికి సంబంధించిన ఫైలు కార్యాలయంలో లేదని చెప్పడం గమనార్హం. ఎలాంటి పత్రాలు లేకుండా పూర్తిస్థాయి విచారణ చేపట్టకుండా అక్రమ వారసత్వ పట్టా మార్పిడి చేసిన సంబంధిత రెవెన్యూ అధికారుల పై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్, నర్సంపేట ఆర్డీవోలకు ఫిర్యాదు చేసిన పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నత శాఖ అధికారులు చెన్నారావుపేట తహసిల్దార్ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ లీలలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అందుకు బాధ్యులైన రెవెన్యూ అధికారుల పై తగిన చర్యలు తీసుకోని న్యాయం చేయాలని డిమాండ్ చేశాడు.

# గోవధ జరగకుండా హిందువులు అడ్డుకోవాలి




### అధికారులకు సమాచారం అందించాలి

### బిజెపి జిల్లా అధ్యక్షులు బలరాం

ములుగు, సూర్యప్రతినిధి జూన్ 16 (మేజర్ న్యూస్); గోవధను అడ్డుకునేందుకు హిందూ సమాజం సిద్ధం కావాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు బలరాం పిలుపునిచ్చారు. ఆదివారం బీజేపీ పార్టీ కార్యాలయంలో ముఖ్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు బలరాం మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా ఎటువంటి గోవధా జరగకూడదు అని, గోవు హిందువుల ఆరాధ్య దైవమని, ముక్కోటి దేవుళ్ళు గోవులో ఉంటాయని ప్రతి హిందువు గోమాతను పూజిస్తాడని అలాంటి గోవులను వదించడం అనేది నేరమని, కాబట్టి వదించకూడదని అన్నారు. హైకోర్టు కూడా ఎక్కడ కూడా గోవధ జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని చెప్పడం జరిగింది. హిందువుల పండుగలకు అనుమతులు తీసుకోవాలని చెప్పే అధికారులు కోర్టు చెప్పిన సూచనలను అన్య మతస్తులకు గోవధా చేయకూడదని ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు ఈ బక్రీద్ సందర్భంగా తగు చర్యలు తీసుకుని గోవులను రక్షించి హిందువుల మనోభావాలను కాపాడాలని కోరడం జరిగింది.

ప్రభుత్వం కూడా దీనిపై దృష్టి పెట్టాలని లేనిచో హిందువుల ఆగ్రహానికి గురి కాక తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు జినుకల కృష్ణాకర్ రావు, బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి దొంతిరెడ్డి రవి రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు ఎల్కతుర్తి శ్రీహరి, బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షులు రాయంచు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి హరీష్, జిల్లా కార్యదర్శి బోగిరి రాకేష్, ప్రచార కార్యదర్శి గొట్టిముక్కుల నరేష్ శర్మ పాల్గొన్నారు.

# మున్నూరుకాపు మండల కమిటీ ఎన్నిక



కన్నాయిగూడెం, జూన్ 16(మేజర్ న్యూస్ సూర్య): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో ఆదివారం రోజున మున్నూరుకాపు సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు.ములుగు జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షులు పిట్టల మధుసూదన్ పటేల్ ఆధ్వర్యంలో కన్నాయిగూడెం మండలం కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మున్నూరుకాపు రాష్ట్ర ప్రధానకార్యదర్శి వల్లాల ప్రసాద్ రావు హాజరు అయ్యారు. అనంతరం మండల మున్నూరుకాపు కులబాంధవుల ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షులుగా గూర్రేవుల గ్రామానికి చెందిన బొగ్గుల భాస్కర్ పటేల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా అదే గ్రామానికి చెందిన ఆకుతోట మధూకర్ పటేల్ ను ఎన్నుకున్నారు.అనంతరం ఇరువురు మాట్లాడుతూ తమ మీద ఉన్న నమ్మకంతో తమకు మండల కమిటీలో బాధ్యతలు ఇచ్చిన రాష్ట్ర నాయకులు మరియు మండల మున్నూరుకాపు కులబాంధవులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కావొచ్చు జిల్లాలో కావొచ్చు రాష్ట్రంలో కావచ్చు ఎక్కడైనా మున్నూరుకాపు సంఘం అభివృద్ధికి తమ వంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ ఆది కోటేశ్వరరావు పటేల్, సంయుక్త కార్యదర్శి గణేష్ పటేల్, భద్రాచలం నియోజకవర్గ కో ఆర్డినేటర్ దనాపనేని వెంకటేశ్వర్లు పటేల్, నూగురు



వెంకటాపురం మున్నూరుకాపు సంఘం మండలం అధ్యక్షులు జక్కుల శ్యామ్ పటేల్ మరియు వివిధ గ్రామాల మున్నూరుకాపు సోదరులు పాల్గొన్నారు.





## పూర్వ విద్యార్థులు ఐకమత్యంగా ఉండాలి

### విశ్రాంత హెచ్ఎం స్వరాజ్ బాబు



కేసముద్రం,జూన్ 16, మేజర్ న్యూస్ (సూర్య): పూర్వ విద్యార్థులు ఒకరికి ఒకరు సహకరించుకుంటూ ఐకమత్యంతో ఉండాలని కేసముద్రం స్టేషన్ జడ్పి హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు స్వరాజ్ బాబు అన్నారు. కేసముద్రం స్టేషన్ జెడ్పీ హైస్కూల్ 2003-04 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని స్థానిక వీసీబీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు.20 ఏళ్ళ తర్వాత కలిసిన తమ స్నేహితులతో జ్ఞానపకా లను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ హెచ్ఎం స్వరాజ్ బాబు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఇలాంటి సమ్మేళనం ద్వారా కలుసుకొని ఒకరికొకరు సహాయసహకారాలు అందించుకోవాలని సూచించారు. పాజిటివ్ దృక్పథంతో మెలగాలని, అది జీవితంలో ఉన్నత స్థానానికి తీసుకువెళు తుందని అన్నారు. అనంతరం రిటైర్డ్ హెచ్ఎం తోపాటు ఆ బ్యాచ్ కు బోధించిన ఉపాధ్యాయులు వంగ దుర్గాప్రసాద్,ఉప్పల వీరయ్య, శ్రీనివాసాచారి, ఎం.రామానుజాచారి, శాలువా వెంకటయ్య, పెండెం రాజవీరు, రమేష్ రెడ్డి, నజీరొద్దిన్,టి.నమ్మాళ్వార్, జి.వెంకటేశ్వర్లు, బిల్లిపెల్లి లక్ష్మారెడ్డి,రిజ్వాన, సాయిలు, బండారు మధు ను ఘనంగా సన్మానించా రు. ఈ కార్యక్రమంలో ఎండీ.రజాక్, చేతి సంతోష్, ఎండీ.రహెమాన్,కొండ శ్రీను,రాజు,మిర్యాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా

### ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గట్ల వీరస్వామి



తాడ్వాయి జూన్ 16మేజర్ న్యూస్ సూర్య: ఆటో యూనియన్ నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందు కు కృషి చేస్తానని గట్ల వీరస్వామి అన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హనుమకొండ జిల్లా తెలంగాణ ఆటో యూనియన్ అధ్యక్షులు గౌని రాజు మేడారం సమ్మక్క సారలమ్మ సన్నిధిలో తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ ములుగు జిల్లా కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ములుగు జిల్లా అధ్యక్షులుగా గట్ల వీరాస్వామి,ఉపాధ్యక్షులు భూక్యా శ్యామ్,పులి భద్రయ్య,ప్రధాన కార్యదర్శి ఇర్సవడ్ల పూర్ణ చందర్,కార్యనిర్వహణ కార్యదర్శి గుంటి మల్లేష్,అధికార ప్రతినిధి ఎండీ మహిమధ్, కార్యదర్శులు లేగల ప్రవీణ్, మునిగడుగుల సాంబయ్య,ముదురు కోళ్ల సతీష్,వేల్పుల నరేష్, సహాయ కార్యదర్శి కుమ్మరి దుర్గారావు,ప్రచార కార్యదర్శి కొత్తకోట శ్రీరాములు,తాల్లపెల్లి నరేందర్,ముఖ్య సలహాదారులు :-పురుషోత్తం నారాయణ,ఠాకూర్ శివరత్ సింగ్,కార్యవర్గ సభ్యులు:- తిప్పనపెల్లి రాము,ఇర్ప లక్ష్మణ్ , పొడిశెట్టి మహేందర్ లను కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



## ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

మల్హార్,జూన్ 16 మేజర్ న్యూస్ సూర్య: మండల కేంద్రమైన తాడిచెర్ల లోని పెద్దమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఆదివారం మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మల్హార్ ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా చొప్పరి రాజు (ప్రజాకలం) ఉపాధ్యక్షుడిగా మల్కా కార్తీక్ రావు, (ప్రజాధర్బార్) ప్రదాన కార్యదర్శిగా బూడిద సాగర్ (సూర్య దినపత్రిక) కోశాధికారిగా రాగం కుమార్ యాదవ్ (స్టార్ 9 ఎలక్ట్రానిక్ మీడియా ) కార్యదర్శిగా లింగన్నపేట శ్రీనాథ్ (తెలుగు ప్రభ) ముఖ్య సలహాదారుగా చొప్పరి రాజయ్య (జనంసాక్షి) కార్యవర్గ సభ్యులుగా చిందం భాస్కర్, (అక్షర దర్బార్) శ్రావణ్ కుమార్ (పీపుల్స్ డైరీ) జి ప్రదీప్ కుమార్ (ప్రత్యక్ష సాక్షి)లు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షునిగా ముడుతన పెల్లి ప్రభాకర్ ఎన్నికయ్యారు.



# త్యాగ నిరతికి ప్రతీక బక్రీద్...!



## నేడు బక్రీద్ పండగ వేడుకలు

## ఖుర్బాని ఇవ్వడానికి ముస్లిం సోదరులు ఏర్పాట్లు

చెన్నారావుపేట జూన్ 16 (సూర్య మేజర్ న్యూస్): త్యాగానికి ప్రతీకగా ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ప్రతి ఏడాది ముస్లింలు అత్యంత వైభోపేతంగా నిర్వహించుకునే పండుగలలో రంజాన్ తర్వాత అత్యంత ముఖ్యమైనది బక్రీద్. నేడు సోమవారం ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలను నిర్వహించుకోనున్నారు. 'బక్రీద్' అంటే ముస్లిములు మేకలను, గొర్రెలను, ఆవులను బలిచ్చి బిర్యానీలు వండుకు తినే పండుగన్నది చాలా మంది ముస్లిమేతరుల భావన.. నిజానికి 'బక్రీద్' పండుగ అసలు పేరు ఈదుల్ అద్ హా' అంటే 'త్యాగాల పండుగ' అని అర్థం.దీనికి రెండు నెలల ముందు వచ్చే మరొక పండుగ 'రంజాన్ దీని అసలు పేరు 'ఈదుల్ ఫితర్ అంటే దానాల పండుగ'. ఈ విధంగా ఇస్లాం నిర్దేశించే రెండు పండుగల్లో మొదటిది దానాలు' విస్తృతంగా చేస్తూ నిర్వహించుకునే పండుగ రంజాన్ అయితే... రెండవది 'త్యాగం' చేస్తూ నిర్భహించుకునే మరొక పండుగ బక్రీద్..ఈ రెండు పండుగలు తప్ప ముస్లిం సమాజంలో కొందరు జరుపుకునే పండుగలకు ఇస్లాంతో ఏమాత్రం సంబంధం లేదన్న విషయాన్ని గమనించాలి. 'త్యాగాల పండుగ' ఈ పదం వినటానికి, చదవటానికి చాలా ఆశ్చర్యంగా ఉంది కదూ! ఎందుకంటే 'పండుగ' అంటే ఇంటిల్లిపాది కొత్త బట్టలు, రుచికరమైన ఆహారాలు వండుకు తింటూ సంతోషంగా గడపటం అన్నదే అందరికి తెలిసింది. కాని ఇస్లాం దీనికి పూర్తి భిన్నంగా మీ ఇంటిల్లిపాది జరుపుకునే పండుగలలో అగత్యపరులు, అవసరార్థులు, బీదలను, మీ దగ్గరి బంధువులను, మీ ఇరుగు పొరుగువారిని కూడా మీ సంతోషంలో భాగస్వాములుగా చేసుకుని వారికి మీకు కలిగి ఉన్నంతలో దానమిచ్చి, మీరు తినే దానిలో వారిని కూడా భాగస్వాములుగా చేసుకుని పండుగ చేసుకోవలసిందిగా ఆజ్ఞాపిస్తుంది. అందుకే ప్రతీ వ్యక్తి ప్రవృత్తిలో దాన గుణాన్ని' త్యాగనిరతిని' పెంపొందించటానికి ఒక పండుగను 'దానాల పండుగ 'అని.. మరొక పండుగను 'త్యాగాల పండుగ ' అని నిర్దేశించటం జరిగింది.





### ఏమిటీ త్యాగాల పండుగ...

సంక్షిప్తంగా ప్రవక్త ఇబ్రాహీం (అలై) దైవ మార్గంలో చేసిన బలికి గుర్తుగా దైవ మార్గంలో ఒక గొర్రెనో, మేకనో, ఆవు లేక ఒంటెనో బలి ఇవ్వాల్సిందిగా నిర్దేశించటం జరిగింది. దానికి కారణం పై జంతువులలో వేటినో ఒక దానిని బలిచ్చి ఎవరికి వారు వండుకు తినటానికి కాదు. అసలు కారణం- ఆ బలి ఇవ్వగా వచ్చిన మాంసంలో మూడు భాగాలు చేసి ఒక భాగం పేదలకు పంచాలి తద్వారా ఎందరో ఆకలితో అలమటించే పేదలకు రుచికరమైన ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుంది. మరొక భాగం బంధువులు దగ్గరవారు ఇరుగుపొరుగు వారికి దానం చేసి మిగిలిన ఒక భాగం స్వయంగా తినటం కోసం అన్న ఉద్దేశంతో మాత్రమే!ఈ విధంగా సమాజంలో పేదలు, బంధువులు, ఇరుగుపొరుగు వారికి జంతువును బలిచ్చిన జంతు మాంసం నుండి మూడొంతుల్లో రెండొంతులు ఇవ్వటం అన్న ప్రక్రియ ద్వారా ఒక వ్యక్తిలో త్యాగనిరతిని, దాన గుణాన్ని పెంపొందించటం అన్నది వాస్తవానికి ఈ బక్రీద్ పండుగను నిర్దేశించటం వెనుక ఉన్న అసలు మౌలిక లక్ష్యం.

### అసలు బలి ఇవ్వాల్సినవి ఏమిటి?


ధర్మంలో ప్రార్ధన, ఉపవాసం, జంతు బలి ఇవ్వటం వగైరా క్రతువులు ఏదో పుణ్యం కోసం యాంత్రికంగా చేసుకుపోవటానికి నిర్దేశించినవి కావు. కాని వాటిని నిర్వర్తించటం ద్వారా ఉన్నత విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని నిర్మించి.. మంచిపనులు చేసే ప్రవృత్తిని జనింపజేయటమే! ధర్మంలో సదా చారణ 'గమ్యం'... అయితే క్రతువులన్ని గమనాలు అవుతాయి అంటే గమ్యాన్ని చేర్చే సాధనాలన్న మాట. దైవమార్గంలో ఒక వ్యక్తి చేసే ఆరాధనలైనా, బలిదానాలైనా స్వీకరించబడాలంటే.. ముందు అతని సదాచారణ బాగుండాలి. అదే లేనప్పుడు ఎన్ని ఆరాధనలు చేసినా ఎన్ని బలిదానాలిచ్చినా.. మరెన్ని క్రతువులు నిర్వర్తించినా అవన్ని బూడిదలో పోసిన పన్నీరే అవుతాయి.ఇక బక్రీద్ రోజున దైవ మార్గంలో ఒక వ్యక్తి జంతు 'బలి దానం' ఇవ్వటం అన్న క్రతువుతో 'ఖుర్బానీ (త్యాగం) అన్న ప్రక్రియ పూర్తి అయిపోదు. నిజానికి ఒక వ్యక్తి చెయ్యవలసిన 'ఖుర్బానీలు (త్యాగాలు) ఏమిటో ఈ క్రింది ఖురాన్ వాక్యంలో చదవగలరు. మీరు అమితంగా ప్రేమించే వస్తువులను (దైవ మార్గంలో) ఖర్చుపెట్టనంతవరకూ మీరు సత్కార్య స్థాయికి చేరుకోలేరు' 3:96 అమితంగా ప్రేమించే వాటిని త్యాగం చెయ్యటం.. అంటే మనిషి... అమితంగా ప్రేమించే ధనాన్ని త్యాగం చెయ్యగలగాలి... అమితంగా ప్రేమించే వస్తువులను త్యాగం చెయ్యగలగాలి...అమితంగా ఇష్టపడే ఆహార పదార్థాలను త్యాగం చెయ్యగలగాలి... ఈ విధంగా మనిషి అమితంగా ప్రేమించే పై వాటిని త్యాగం చెయ్యటంతో పాటు మనిషి..ఇతరుల పట్ల ఉండే ఈర్ష్యా-ధ్వేషాలను బలి ఇవ్వాలి... వదులుకోలేని బలహీనతలను బలి ఇవ్వాలి...చెడు కోరికలను, చెడు ఆలోచనలను బలి ఇవ్వాలి... కాబట్టి బక్రీద్ రోజు జంతు బలి ఇవ్వటం అన్నది ఒక కేవలం ప్రవక్త ఇబ్రహీం (అలై) బలికి ఒక 'గుర్తు' గా నిర్వర్తించే క్రతువు అయినప్పటికి దైవ మార్గంలో అమితంగా ప్రేమించే వాటిని అంటే మనిషి అమితంగా ప్రేమించే ధనాన్ని, ఆహార పదార్థాలను, వస్తువులను త్యాగం చెయ్యగలగాలి.. దానితో పాటు ఈర్ష్యా ధ్వేషాలను, బలహీనతలను, చెడు కోరికలను బలివ్వాలి. ఈ రకమైన త్యాగనిరతిని వ్యక్తిత్వంలో కలిగి ఉన్నప్పుడే ఖుర్బాని ఇవ్వటం అన్న ప్రక్రియకు సార్థకత చేకూరుతుంది.ఒకవేళ నేడు ముస్లిం సమాజంలో బక్రీద్ ను పురస్కరించుకుని ఎందరో ఎన్నెన్నో బలిదానాలు ఇస్తున్నప్పటికి.. ఖురాన్ ఆశిస్తున్నంత స్థాయి వ్యక్తిత్వ నిర్మాణం చాలా మందిలో అభివృద్ధి చెందటం లేదంటే.. అర్థం చేసుకోవలసింది చాలా మంది బలి (ఖుర్బాని) అన్న క్రతువును ఏదో పుణ్యం కొద్ది సెంటిమెంటుగా నిర్వర్తిస్తున్నారే తప్ప ఆ జంతు బలితో పాటు అసలు బలి ఇవ్వవలసిన వాటిని బలివ్వటం లేదనే అర్థం.కాబట్టి దైవమార్గంలో ఇచ్చే జంతు బలి (ఖుర్బాని) అసలు ఉద్దేశాన్ని అర్థం చేసుకుని బక్రీద్ పండుగను అందరూ సుఖ సంతోషంగా జరుపుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు.

### జిల్లా వ్యాప్తంగా సన్నహాలు...

ముస్లింల పండగలలో ప్రధానమైన బక్రీద్ పండుగను జరుపుకోవడానికి జిల్లా వ్యాప్తంగా యావత్ ముస్లింలు సన్నాహాల్లో నిమగ్నమయ్యారు. అందుకోసం ప్రధాన పట్టణాలు, నగరాలు, మండల కేంద్రాల్లోని ముస్లింలు తమ ఆరాధ్య దైవమైన అల్లా జ్ఞాపకానుసారం ఖర్బాని (జంతు బలిదానం) ఇవ్వడానికి గొర్రెలు, మేకలను సిద్ధం చేసుకున్నారు

## పిడుగుపాటుతో మూడు చెట్లకు మంటలు

మల్హర్, జూన్ 16 మేజర్ న్యూస్ సూర్య: వర్షాకాలం సమీపిస్తున్నలతో ఉరుములతో కూడిన చిరుజల్లులు కురుస్తున్నాయి ఇందులో భాగంగా ఆదివారం రోజున మల్హర్ రావ్ మండలంలోని అడ్వాలపల్లి గ్రామం రెడ్డి నాయక్ ఇంటి సమీపంలో పిడుగు వేయడంతో మూడు తాటి చెట్లకు మంటలు అంటుకున్నాయి. ఉరుములు మెరుపులు తో కూడిన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉరుములతో కూడిన తీవ్ర వర్షాపాలతో ఉన్న సందర్భంగా తగు జాగ్రత్తలు పాటించాలని పలువురు అజ్ఞానులు సూచిస్తున్నారు.



## జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేయాలి

### డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్

గోవిందరావుపేట, జూన్ 16 (మేజర్ న్యూస్ సూర్య): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించి వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగంటి వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఆదివారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ)జిల్లా కమిటీ సమావేశం గోవిందారావుపేట మండలం పసర గ్రామంలో జిల్లా అధ్యక్షులు బి.సంజీవ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈసమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలండర్ ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఎన్నికల హామీ ప్రకారం జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఆయా శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు అన్నింటికి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసినందున రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా లక్షలాదిమంది నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఉద్యోగ నియమకాలను చేపట్టాలన్నారు. ఉద్యోగాలు ఇచ్చేంతవరకు నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఐదువేల రూపాయలు ఇవ్వాలని అన్నారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను నిర్లక్ష్యం చేయడంతో తీవ్రమైన ఇబ్బందులుపడ్డారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన తప్పులను చేయకుండా నిరుద్యోగ యువతకు పారదర్శకంగా ఉద్యోగాల నియమకాలు చేపట్టాలన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో వివిధ కేటగిరీల్లో కొత్తగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వలేదని, ఉద్యోగ నియామక పత్రాలు అందుకొని దాదాపు నాలుగునెలలు గడుస్తున్నా వారికి పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వలేదని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పోస్టింగులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంజీవ, రత్న ప్రవీణ్, నాయకులు పూనం క్రిష్ణ బాబు, పిట్టల అరుణ్, చంద్రశేఖర్, చంటి, ఎండి.దిల్వార్, జక్కు వేణు, రాజు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా 8వ కలెక్టర్‌గా రాహుల్ శర్మ

### నూతన కలెక్టర్ కు ఘన స్వాగతం పలికిన అధికారులు

### సంక్షేమ పథకాలు పేదలకు అందించే విధంగా పని చేయాలి

### జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్ జూన్ 16,మేజర్ న్యూస్ సూర్య: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పేదలకు ప్రభుత్వ పథకాలను అందించే విధంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ల బదిలీల నేపథ్యంలో వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ గా పని చేస్తున్న 2017 బ్యాచ్ కి చెందిన రాహుల్ శర్మను ప్రభుత్వం జిల్లా కలెక్టర్ గా బదిలీ



చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా 8వ కలెక్టర్ గా పదవీ



బాధ్యతలను చేపట్టారు. అన్ని శాఖల జిల్లా అధికారులు కలెక్టర్కు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలుపుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ అన్ని శాఖల జిల్లా అధికారులు ఆయా శాఖకు సంబంధించిన నివేదికలు అందజేయాలని అన్నారు. త్వరలో శాఖాలు వారిగా సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.అందరం సమన్వయంతో పని చేసి జిల్లను అభివృద్ధి లో మోడల్ గా నిలిపేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ జిల్లాను



అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని జయ శంకర్ భూపాలపల్లి జిల్లా నూతన కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అట్టడుగు వర్గాల ప్రజలకు చేరువ చేస్తామని అన్నారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు మనందరం పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. సిరిసిల్లలో ఆసిస్టెంట్ కలెక్టర్ గాను, నల్గొండ, వికారాబాద్ జిల్లాల్లో అదనపు కలెక్టర్ గా పనిచేశానని, వికారాబాద్ నుండి కలెక్టర్ గా భూపాలపల్లి జిల్లాకు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేస్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెవిటి వారికి

# ఉచితంగా వినికిడి పరికారాల పంపిణీ

### చైర్మన్ మారుతి సేవలు అభినందనీయం

### ముఖ్యఅతిథిగా హాజరైన జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి)

### రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య

భూపాలపల్లి రూరల్ జూన్ 16,మేజర్ న్యూస్ సూర్య: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా చెవిటి వారికి వినికిడి పరికరాల పంపిణీ కార్యక్రమం జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సామాజిక సేవా కార్యకర్త అయిలీ మారుతి ఆధ్వర్యంలోని జయశంకర్ ఫౌండేషన్ అనేక సామాజిక సేవలు చేయడం చాలా అభినందనీయమని, స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజాసేవల పేరిట ముసుగులు ధరించి గోరంత సేవలు చేస్తూ కొండంత పబ్లిసిటీ పొందాలని ప్రయత్నిస్తున్న ఈ కాలంలో నిస్వార్థంగా సేవలు చేస్తున్న అయిలి మారుతిని, వారి టీమును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో 250 మందికి ప్రతిరోజు నిత్యాన్నదాన కార్యక్రమం, మొరంచపల్లి వరద బాధితులకు నిర్విఘ్న సేవలు, చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్లు, వృద్ధులకు కంటి ఆపరేషన్లు, అనాధ పిల్లలను చదివించడం, పేద విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ కోచింగ్, కాళ్లు లేని వారికి ఉచితంగా కృత్రిమ కాళ్ల బహుకరణ, ఆపదలో ఉన్నవారికి





ఆర్థిక సాయం చేయడం వంటి కార్యక్రమాలను ఎలాంటి లాభాపేక్ష, రాజకీయ దురుద్దేశం లేకుండా నిస్వార్థంగా సేవలు అందిస్తున్న అయిలి మారుతి టీం సభ్యులందరికీ శుభాశీస్సులు, అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్న జయశంకర్ ఫౌండేషన్ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రోత్సాహం అందించవలసిన అవసరం ఉన్నదని వెంటనే వీరి సంస్థను గుర్తించి వీరి కార్యక్రమాలకు తోడ్పాటు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతి అంశంలో న్యాయపరంగా జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) అండగా ఉంటుందని తమ సహాయ సహకారాలు, తోడ్పాటు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి చెవిటి వారికి ప్రత్యేక డాక్టర్ చే పరీక్షలు అనంతరం వారి చెవిటి శాతం అనుసరించి పరికరాలను తప్పకుండా అందిస్తామని అన్నారు .ఈ అవకాశాన్ని ప్రతి చెవిటి వారు వినియోగించుకోవాలని ఈ విషయంలో ప్రతి ఒక్కరు సహకరించాలని మేధావులను, నాయకులను, ప్రజా ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఆర్ సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య, భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు కుమార్ యాదవ్, ఉపాధ్యక్షులు స్వామి యాదవ్, సంయుక్త కార్యదర్శి శిల్పాక నరేష్, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఇన్చార్జి విజయగిరి సమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి భీమనాదుని సత్యనారాయణ, జయశంకర్ ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాంబరాతి పోషన్న, సభ్యులు చింతకింది రాజు, కొత్తపల్లి రాజు, బోనాల మధు, ప్రవీణ్, ప్రతాప్, మధు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి, ములుగు, పెద్దపల్లి, మంచిర్యాల, హనుమకొండ, వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున చెవిటి వ్యాధిగ్రస్తులు వినికిడి పరికరాల కోసం హాజరయ్యారు.



# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ధర్మసాగర్ జూన్ 16 ( సూర్య న్యూస్): 1980,1981. టెన్త్ క్లాస్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం మడికొండ మా ఫంక్షన్ హాల్ లో విద్యను బోధించిన అధ్యాపకుల మధ్య ఘనంగా జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వెంగళ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగింది ఈ కార్యక్రమానికి సుమారుగా విద్యార్థు నీ విద్యార్థులు 70 మంది పాల్గొన్నారు అధ్యాపకులు వెంకటేశ్వర్లు , నాగభూషణం , జోగా రెడ్డి , ఎల్లయ్య కాకతీయ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ రిటైర్డ్, ఉమా మహేశ్వరం, కొమురయ్య , బొందయ్య , పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కాకతీయ యూనివర్సిటీ ప్రిన్సిపాల్ రిటైర్డ్ ఎల్లయ్య , మాట్లాడుతూ 44 సంవత్సరముల విద్యార్థులు ఈరోజు మా స్థాయికి వచ్చి ఉన్నారు అయినప్పటికిని మీకెంతో ఓపికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం మాకు ఎంతో ఆనందదాయకంగా ఉందని విద్యార్థులను కొనియాడారు ఈరోజు చూసినట్లయితే మాతోపాటు ఎన్నెన్నో ఉద్యోగ రీత్యా మీరు అనుభవిస్తున్నారు. మీరు సుమారుగా 58, 60 సంవత్సరముల వాళ్లు ఉన్నారు మీరు మా అంతటి వాళ్లు అయ్యారు . మమ్ములను పిలిచి ఇంత ఘన సత్కార్యం చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఇలాంటి రోజులు మరెన్నో రావాలని నేను ఆశిస్తున్నాను, అలాగే నాగభూషణం సార్ మాట్లాడుతూ మీరు మొదటగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి పెద్దలు చెప్పేవారు ఆరోగ్యమే మహా భాగ్యమని దానిని మించినది ఆస్తి ఇంకొకటి లేదు కాబట్టి మీరు ఒక స్టేజికి వచ్చారు ఆరోగ్యాన్ని కాపాడుకోండి అని హిత బోధ చేశారు. విద్యార్థులు విద్యార్థి దశను గుర్తు చేసుకుని అర్థవంతంగా పాట ల ద్వారా వారి ఉద్దేశాన్ని తెలియజేశారు .అనంతరం మెమోంటో లు అధ్యాపకులచే పూర్వ విద్యార్థులు అందుకోవడం జరిగింది. తదనంతరం గ్రూప్ ఫోటోతో మీటింగ్ పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు 70 మంది పాల్గొన్నారు.





# జిల్లా నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన దివాకర టి.ఎస్

**అభివృద్ధిలో అగ్రగామిగా ములుగు జిల్లాను తీర్చిదిద్దేందుకు కృషి**

**ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేస్తా**

ములుగు, సూర్యప్రతినిధి జూన్ 16 (మేజర్ న్యూస్): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరవేయడానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ తెలిపారు. ఆదివారం కలెక్టర్ ఛాంబర్ లో నూతన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కు జిల్లా అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ లో దివాకర్ టిఎస్ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి కలెక్టర్ కు





పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క అర్హులైన లబ్ది దారునికి అందేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. త్వరలో శాఖలు వారిగా సమీక్ష నిర్వహిస్తానని , జిల్లా అధికారుల సమన్వయంతో ములుగు జిల్లాను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లాలోని అధికారులు నిత్యం ప్రజలకు అందుబాట్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరౌచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడానికి కృషి చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి అల్లం రాజకుమార్, డిపిఆర్ఓ ఎండి రఫీక్, ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## త్యాగం, సహనానికి ప్రతీక బక్రీద్

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగామ, జూన్ 16, మేజర్ న్యూస్: త్యాగం, సహనానికి ప్రతీకగా జరుపుకొనే బక్రీద్ (ఈద్‌– అల్‌–అదా) పండుగ సందర్భంగా జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త బోధనలను పాటించాలని, సాటి వారిపై దయ, కరుణ చూపాలని, ఈ పండుగ విశ్వాసం, భక్తితో జీవించాలనే గొప్ప సందేశాన్నిస్తుందని, తమకు ఉన్నదంట్లోనే ఇతరులకు పంచిపెట్టే దాతృత్వపు స్ఫూర్తిని మానవాళికి చాటి చెప్తుందని కలెక్టర్ తెలిపారు.

## బొమ్మల తయారీలో శక్తివంతమైన కేంద్రంగా భారత్

**ఫ్లిప్ కార్ట్‌తో కలిసి పని చేయడం ద్వారా బొమ్మల ఎగుమతి దారుగా మార్చే దిశ గా చర్యలు**

**డిపిఐఐటి కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్**

హనుమకొండ , జూన్ 15, మేజర్ న్యూస్: బొమ్మల తయారిలో భారత దేశం ఒక శక్తివంతమైన కేంద్రంగా మారుతుందని డిపార్ట్మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ అన్నారు. డిపార్ట్ మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ సహ కారంతో వర్క్ షాప్ నిర్వహించారు. వర్క్ షాప్‌లో ముఖ్య అతిథులుగా డిపిఐఐటి కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, జాయింట్ సెక్రటరీ సంజీవ్, మహ్మద్ ఇషారార్ అలీ, రజనీష్ కుమార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ఫ్లిప్ కార్డ్ వంటి పరిశ్రమ ప్రముఖులతో కలిసి పని చేయడం ద్వారా భారత దేశాన్ని అధిక నాణ్యత గల బొమ్మల ఎగుమతి దారుగా మార్చే దిశగా మేము ముఖ్యమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సరైన మార్గదర్శకత్వం , మద్దతుతో బొమ్మల తయారిలో భారత దేశం ఒక శక్తివంతమైన కేంద్రంగా మారుతుందని మేము నమ్ముతున్నామని చెప్పారు. ఫ్లిప్ కార్డ్ చీఫ్ కార్పొరేట్ అఫైర్స్ ఆఫీసర్ రజనీష్ కుమార్ మాట్లాడుతూ ఫ్లిప్ కార్డ్ మార్కెట్ ప్లేస్ ద్వారా స్థానిక బొమ్మల తయారి దారులకు భారత దేశం అంతటా కస్టమర్ లను చేరుకోవడానికి వేదికను అందించగలిగామన్నారు.తద్వారా వారి వృద్ధికి తోడ్పడుతున్నామని చెప్పారు. భారత దేశంలో బొమ్మల పరిశ్రమ ను బలోపేతం చేయడంలో ప్రపంచ బొమ్మల తయారి, ఎగుమతి కేంద్రంగా భారత దేశం యొక్క అభివృద్ధిని వేగవంతం చేయడంలో సహాయపడటానికి డిపిఐఐటి , వాణిజ్య మంత్రిత్వ శాఖ యొక్క ప్రయత్నా లకు మద్దతు ఇవ్వడానికి మేము సంతోషిస్తున్నామన్నారు. వర్క్షాప్ , హ్యాకథాన్ ప్రభుత్వ లక్ష్యాన్ని సా ధించే అవకాశాలను గుర్తించడంలో కార్యక్రమంలో పాల్గొన్న వాటాదారులందరికి సహాయ పడుతామ న్నారు. డిపిఐఐటి, ఫ్లిప్ కార్డ్ భాగస్వామ్య వర్క్షాప్ ఇ కామర్స్ శక్తిని ఉపయోగించడం ద్వారా నాణ్యత మెరుగుదల, అవిష్కరణ, పరిశ్రమ ప్రమాణాలకు కట్టుబడి ఉండటం ద్వారా భారతీయ బొమ్మల పరిశ్రమను ఉన్నతీకరించడానికి లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఫ్లిప్ కార్డ్‌లో చేరిన కొత్త తయారులు స్ట్రీమ్ లైన్డ్ రిజిస్ట్రేషన్, డెడికేటెడ్ అకౌంట్ సెటప్ సహాయం, వ్యక్తిగతీకరించిన ఖాతా మేనేజ్మెంట్ , ధర, ఫుల్ ఫిల్మెంట్ మరిన్నింటిని కోసం సెల్లర్ మద్దతు నుండి ప్రయోజనం పొందుతారని పేర్కొన్నారు. డేటా అనలిటిక్స్, లాజిస్టిక్స్ లో ఫ్లిమ్ కార్డ్ నైపుణ్యాన్ని ఉపయోగించుకోవడం ద్వారా , బొమ్మల తయారి దారులు ఈ కామర్స్‌ను సమర్థవంతంగా వినియోగిం చుకోవటం చేయవచ్చునన్నారు. విస్తృత స్థా యిలో వినియోగదారులను చేరుకోవచ్చు, స్థిరమైన వృద్ధిని సాధించగలరన్నారు. ప్రస్తుతం మిలియ న్ల కొద్ది భారతీయ బొమ్మల తయారి దారులు ఫ్లిప్ కార్డ్ ప్లాట్ ఫారమ్ లో అభివృద్ధి చెందుతున్నారని , భాగస్వామ్య కార్యక్రమం భారతదేశపు బొమ్మల పరిశ్రమ లో నూతన అభివృద్ధి, ఆవిష్కరణల శకానికి నాంది పలుకుతుందని తెలిపారు. కార్యక్రమంలో బొమ్మల తయారి దారులు పాల్గొన్నారు.

# చెరువు శిఖం పట్టాలను రద్దు చేసి దళితులకు అందించాలి

చిట్యాల, జూన్ 16 మేజర్ న్యూస్: మండలంలోని నవాబుపేట గ్రామ శివారు లోని చెరువు శిఖం పట్టాలను రద్దు చేసి కాస్తు లో ఉన్న లబ్ధిదారులకు అందించాలని దళితులు అధికారులను కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నవాబుపేట గ్రామానికి చెందిన దళితులు చిలుమల రాజయ్య, శ్రీనివాస్, బొజ్జపల్లి భద్రయ్య, రవీందర్, సాంబయ్య, చిలుముల స్వరూప, బొజ్జపల్లి శ్రీనాద్, శారద లు మాట్లాడుతూ నవాబుపేట గ్రామ శివారులో వంక సముద్రం చెరువు శిఖంలో సర్వే నెంబర్ 45 లో వందల సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్నామని వారు చెప్పారు. మాకు తెలియకుండా గ్రామానికి చెందిన సర్పంచ్ కసిరెడ్డి సాయి సుధా ఆమె భర్త రత్నాకర్ రెడ్డి రెండు ఎకరాలు పైగా పట్టా చేసుకున్నాడని చెప్పారు. అట్టి భూములో జెసిబి సహాయంతో చెరువులోని మట్టిని తీసుకొని చదును చేస్తుండగా మేము వెళ్లి ఆపడానికి ప్రయత్నించగా మాపై దురుసుగా ప్రవర్తించాడని వారు పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి గ్రామ మాజీ సర్పంచ్ సాయిసుధా రత్నాకర్ రెడ్డి అక్రమంగా చేసుకున్న పట్టా రద్దు చేసి సాగులో ఉన్న దళితులకు అందరికి భూమిని కేటాయించాలని వారు కోరారు.

